ఆర్మీ ట్రైనింగ్ పూర్తి చేసుకొని స్వస్థలానికి వచ్చిన ప్రీతి బసుకు ఘన స్వాగతం పలికిన రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు

ఆర్మీ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న
ప్రీతి బసుకు ఘన స్వాగతం

కాగజ్‌నగర్ ఎస్పీయం కాలనీ, డిసెంబర్ 22 : కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్-10కి చెందిన వికాస్, సులేఖ దంపతుల కుమార్తె ప్రీతి బసు 15 నెలల ఆర్మీ ట్రైనింగ్ పూర్తి చేసుకొని రాగా, రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకొని పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అనంతరం ఊరేగింపు తీశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఆర్మీకి సెలక్ట్ అయిన మొట్టమొదటి యువతిగా ప్రీతి బసు నిలిచింది. నాగాలాండ్ రాష్ట్రం అస్సాం రైఫిల్స్‌లో ట్రైనింగ్ తీసుకొని రావడం జిల్లాకే గర్వకారణమని రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే శివ, ఉపాధ్యక్షుడు పాపయ్య, జనరల్ సెక్రెటరీ సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వినాయక చాప్డె, జాయింట్ సెక్రెటరీ రమాకాంత్ యాదవ్, ట్రెజరర్ శివప్రసాద్, దిలీప్ సర్కార్, రాజేశ్‌గోష్, తార పద మండల్, శివ పద మండల్, అజయ్ మిశ్రా, డీ.శ్రీనివాస్, అనురోధ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపులో
వారిదే కీలకపాత్ర

- మంచిర్యాల డీఈవో యాదయ్య

మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి, లక్ష కార్యక్రమాలను విజయవంతం చేయడంలో మానిటరింగ్ అధికారులైన ఎంఈవోలు, మండల నోడల్, క్లస్టర్ నోడల్ అధికారులదే కీలక పాత్ర అని మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. జిల్లా సైన్స్ కేంద్రంలో శుక్రవారం రూమ్ టూ రీడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్లస్టర్, మండల నోడల్ అధికారులు, ఎంఈవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానిటరింగ్ అధికారులు పాఠశాలల సందర్శనకు, తరగతి గదుల్లోకి వెళ్లినప్పుడు సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు సూచనలివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, యశోదర, సత్యనారాయణ మూర్తి, రాజ్ కుమార్, సైన్స్ అధికారి మధుబాబు, రూమ్ టూ రీడ్ ఇండియా రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రవీణ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ నితీన్, జిల్లా హెడ్ మధు, రిసోర్స్ పర్సన్‌లు, వివిధ మండలాల ఎంఈవోలు, నోడల్ అధికారులు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం రవాణాకే దీ కళ్లెం?

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జోరుగా రేషన్ రైస్ దందా

- దుకాణాలు ఏర్పాటు చేసి మరీ కొనుగోళ్లు
- గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలింపు
- రీ సైక్లింగ్.. పాలిష్ చేసి అధిక ధరకు విక్రయం
- ఇక్కడ రూ. 15కు కొని.. అక్కడ రూ. 35 దాకా విక్రయం
- అధికారుల తీరుపై విమర్శలు

ఇటీవల కౌటాలలో పట్టుబడ్డ 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : పేదల ఆకలి తీర్చేందుకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు వరంలా మారింది. కొందరు దళారులు మాఫియాగా ఏర్పడి అడ్డదారుల్లో మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలుచోట్ల ప్రత్యేకంగా దుకాణాలు పెట్టి మరీ రూ. లక్షల్లో దందా సాగిస్తుండగా, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రీ సైక్లింగ్ చేసి విక్రయం..

తెలంగాణలో పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారు. దళారులు సేకరించిన రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి.. అక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి మరీ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం విశేషం. సిర్పూర్-టీ మండలం వెంట్రావ్‌పేట్, వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఈ దందాకు అడ్డాలుగా మారాయి. రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. ఈ సమయంలో ఆసిఫాబాద్, రెబ్బెన, బూరుగడ, వాంకిడి, కాగజ్‌నగర్, తదితర ప్రాంతాల్లో కిలోకు రూ. 15 చొప్పున కొనుగోలు చేస్తారు. ఆ తర్వాత మహారాష్ట్రలోని వీరూర్‌లో రూ. 20కి విక్రయిస్తారు. అక్కడి నుంచి మహారాష్ట్రలోని గొందియాకు బియ్యాన్ని సరఫరా చేస్తారు. గొందియా, బల్లార్షాల్లోని రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి పాలిష్ చేస్తారు. ఆపై కిలోకు రూ. 30 నుంచి రూ. 35 చొప్పున విక్రయిస్తారు.

ప్రతి రోజూ 50 టన్నులకు పైగా..

ఇప్పటిదాకా పెద్ద వాహనాల్లో వీరూర్‌కు బియ్యాన్ని తరలించిన వ్యాపారులు.. ఇటీవల తమ విధానాన్ని మార్చుకున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న వ్యాన్‌లలో బార్డర్‌లోని వెంకట్రావ్‌పేట్ వరకు తరలించి అక్కడ గోదాముల్లో డంప్ చేస్తారు. అక్కడి నుంచి భారీ వాహనాల్లో గొందియా, బల్లార్షాల్లోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. రోజుకు 50 టన్నులకు పైగా బియ్యం అక్రమ రవాణా అవుతున్నట్లు తెలిసింది.

వారంలో రెండు చోట్ల..

జిల్లాలో కొందరు దళారులు మాఫియాగా ఏర్పడి ప్రతి నెలా లక్షల్లో దందా సాగిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గట్టి నిఘా ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నా.. వివిధ మార్గాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తూనే ఉన్నారు. సిర్పూర్-టీ, కౌటాల మండలాల్లో వారం వ్యవధిలో బియ్యం పట్టివేత ఘటనలు రెండు చోటు చేసుకున్నాయి. సిర్పూర్-టీ నుంచి మహారాష్ట్రలోని వెంకట్రావ్‌పేట్‌కు తరలిస్తున్న 34.17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన రెండు రోజులైనా గడవకముందే కౌటాల వద్ద మరో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

వెంకట్రావ్‌పేట్‌లో రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఏర్పాటుచేసిన దుకాణాలు

మొదటి స్థానంలో నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, అధికారులు

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత
ఉమ్మడి ఆదిలాబాద్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 22 : జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్రస్థాయి బాల బాలికల ఖోఖో పోటీలు శుక్రవారం ముగిశాయి. అథ్లెటిక్స్ అసోసియేషన్స్ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్ ఫైనల్ పోటీలు ప్రారంభించారు. బాలుర విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్-రంగారెడ్డి జిల్లాలు తలపడగా, ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో రంగారెడ్డి, మూడో స్థానంలో మెదక్ జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో తుది పోరులో ఉమ్మడి ఆదిలాబాద్-మెదక్ జిల్లా జట్లు తలపడగా, ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో మెదక్, మూడవ స్థానంలో ఖమ్మం జట్లు నిలిచాయి. గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవీటీజీ ప్రాజెక్ట్ అధికారి ఆత్రం భాస్కర్, ఏసీఎంవో ఉద్ధవ్, గిరిజన సంక్షేమ ఉమ్మడి జిల్లా క్రీడా అధికారి పార్థసారథి, జిల్లా అధికారి బండ మీనా రెడ్డి, ఎస్జీఫ్ కార్యదర్శి సాంబశివరావు, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, గుర్రాల సురేశ్, హరీశ్, సీ జీ ఎఫ్ రమేశ్, సంధ్య, మల్లేశ్, రవి, శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొలాం, తోటి, పీవీటీజీల
అభ్యున్నతికి కృషి చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- జన్ ధన్ పథకంపై అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 22 : కొలాం, తోటి, పీవీటీజీ ల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రమాదేవితో కలిసి తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా సంక్షేమ, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, విద్యుత్, అటవీ శాఖలు, ఐకేపీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ప్రధాన మంత్రి జన్ ధన్ పథకం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా జిల్లాలోని 149 పీవీటీజీ గ్రామాల్లో చేపట్టవలసిన పక్కా గృహాలు, రహదారులు, ఇంటర్నెట్ సేవలు, విద్యుత్, మంచినీటి సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, సబ్ సెంటర్ల భవనాలు, పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన నివేదికలు రూపొందించి, త్వరగా అందజేయాలని తెలిపారు. కనీసం 50 పీవీటీజీ గ్రామాల్లో మల్టీపర్పస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు జనాభా ఆధారంగా వివాదాలు లేని 1000 చదరపు గజాల స్థలాన్ని గుర్తించి, నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పీవీటీజీల కోసం జన్‌ధన్ బ్యాంక్ ఖాతా తెరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వచ్చే జనవరి 15న లబ్ధిదారులతో ప్రధానమంత్రి మాట్లాడే కార్యక్రమం ఉన్నందున అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్షలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

CHANGE OF NAME
I, KASOJU SRIKANTH S/O KASOJI CHANDRA MOULI , R/o H.No. 2-119, Chincholi B (Vill) Sarangapur (Mdl) Nirmal (D) ,TS Changed My name to KASOJI SRIKANTH for all future purposes

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
సిర్పూర్: 91827 77671, 91827 77677

సింగరేణి ఆవిర్భావ
వేడుకలకు వేళాయే

ముస్తాబైన ప్రగతి, శ్రీ భీమన్న మైదానాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

రెబ్బెన : గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానంలో వేడుకలకు ముస్తాబైన స్టేజీ

శ్రీరాంపూర్/రెబ్బెన, డిసెంబర్ 22 : సింగరేణి ఆవిర్భావ వేడుకలకు వేళయ్యింది. శనివారం అట్టహాసంగా నిర్వహించేందుకు శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియాన్ని యాజమాన్యం సిద్ధం చేసింది. భారీ బెలూన్‌లు ఏర్పాటు చేశారు. ఫుడ్, సూపర్ బజార్, ఎంవీటీసీ, రెస్క్యూ, వైద్యారోగ్య శాఖ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా తెలంగాణ వంటకాలు సిద్ధం చేస్తున్నారు. జీఎం సంజీవరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానంలో అన్నీ సిద్ధ చేశారు. గోలేటి జీఎం కార్యాలయంతో పాటు శ్రీ భీమన్న క్రీడామైదానం రంగు రంగుల విద్యుద్దీపాలతో సరికొత్తగా కనిపిస్తున్నాయి. ఏరియా జీఎం రవిప్రసాద్ ఉదయం వివిధ గనులు, డిపార్టుమెంట్‌లలో జెండాలను ఆవిష్కరించనున్నారు. గ్రౌండ్‌లో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు డప్పు చప్పుళ్ల నడుమ బోనాలు ఎత్తుకొని కోలాటం, బతుకమ్మ ఆడుతూ ర్యాలీగా తరలిరానున్నారు. అనంతరం జీఎం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

రెబ్బెన : ప్రజల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు, టెంట్లు

శ్రీరాంపూర్ : ప్రగతి స్టేడియంలో వేడుకలకు ఏర్పాట్లు

ఎమ్మెల్సీ దండే విఠల్ జన్మదిన వేడుకలు

మంచిర్యాల టౌన్ : కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీసీసీ నస్పూర్ : వృద్ధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 22 : జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శ్రీహర్ష కాలేజీ ఆవరణలో కేక్ కట్‌చేశారు. అంతకుముందు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్, బీఆర్ఎస్ నాయకులు గొంగళ్ల శంకర్, బింగి ప్రవీణ్, ఆరె శ్రీనివాస్, పడాల రవీందర్, చిప్పకుర్తి జగన్, షకీల్, అనిల్, జమాల్ పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 22 : ఆర్‌కే-5కాలనీ బ్యారెక్స్‌లోని శ్రీసాయి వృద్ధుల ఆశ్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్ పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ యూత్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి.. మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. నాయకులు కాటం రాజు, సురేశ్, కుమార్, సాగర్, అనుదీప్ పాల్గొన్నారు.

చెన్నూర్ పట్టణంలోని జగన్నాథాలయం

ముక్కోటి ఉపవాసం..
కోటి యజ్ఞాల ఫలం

- నేడు వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు

చెన్నూర్ టౌన్/మందమర్రి, డిసెంబర్ 22 : సాధారణంగా హిందువుల పండుగలన్నీ చంద్రమానం ప్రకారమో లేక సౌర మానం ప్రకారమో జరుపుకుంటారు. కానీ, ఈ రెండింటి కలయికతో ఆచరించే ఒకే ఒక్క పండుగ ముక్కోటి ఏకాదశి. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన తర్వాత (సౌర మానం) వచ్చే శుద్ధ ఏకాదశి(చంద్రమానం) రోజున ముక్కోటి ఏకాదశి వైభవంగా నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి ఉపవాసం ఉండి స్వామిని దర్శించుకుంటే కోటి యజ్ఞాలు చేసిన పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

ఉత్తర ద్వార దర్శనంతో మోక్షం..

ముక్కోటి ఏకాదశి పండుగను భక్తులు శనివారం వైభవంగా జరుపుకునేందుకు ఆలయాల్లో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రోజున ముక్కోటి దేవతలందరూ విష్ణుమూర్తిని దర్శించుకున్నారని ఓ గాక ప్రాచుర్యంలో ఉంది. అందుకే దీనికి ముక్కోటి ఏకాదశి అని పేరు వచ్చిందని చెబుతుంటారు. ఈనాడే మధుకైటభులనే రాక్షసులకు శాపవిమోచనం కలిగించి, వారికి తన వైకుంఠ ద్వారం వద్ద విష్ణువు దర్శనాన్ని అనుగ్రహించాడు. తమలాగే ఈరోజున ఎవరైతే వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తర ద్వారాన్ని నిర్మించి స్వామిని దర్శించుకుంటారో, వారికి మోక్షాన్ని ప్రసాదించమని వారు వేడుకున్నారట. అప్పటి నుంచి ఉత్తర ద్వారం గుండా శ్రీవారిని దర్శించుకునే ఆచారం మొదలైంది. ఈ ఏకాదశి రోజే వైకుంఠంలోని విష్ణుమూర్తి అంతరంగిక ద్వారాలు తెరుచుకున్నాయి. అందుకే దీనికి 'వైకుంఠ ఏకాదశి' అనే పేరు స్థిరపడింది. వైకుంఠ ఏకాదశి రోజు వైష్ణవాలయాల్లో ప్రత్యేకంగా తెరిచి ఉంచే వైకుంఠ (ఉత్తర) ద్వారం గుండా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఎదురుచూస్తారు.

ఆలయాల్లో ఏర్పాట్లు..

చెన్నూర్‌లోని జగన్నాథ, మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వర ఆలయాల ఉత్తర ద్వార దర్శనం కోసం నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి తెల్లవారుజాము నుంచే స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటారు. మందమర్రిలో ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, ఆయన తనయుడు నర్సింహాచార్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, అర్చన, పుష్పోత్సవం 5.30 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఆయాచోట్ల బారీకేడ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు.

మందమర్రి : స్వామివారి అలంకరణకు పూలమాలలను సిద్ధం చేస్తున్న మహిళలు